మేమింతే.. మారమంతే..!

కాసుల కోసం మద్యం వ్యాపారులతో దోస్తీ
రేటు పెంచుకో... మామూళ్లు ఇచ్చుకో..
ఎక్సైజ్ అధికారుల భరోసా
సివిల్ పోలీసులదీ అదే దారి
తనిఖీలకు మంగళం



5

భూసందేహ పరీక్షలు..!

మట్టి నమూనాల సేకరణలో తీవ్ర జాప్యం
సగం కూడా పూర్తికాని దుస్థితి
సేకరించినవీ.. ల్యాబ్‌కు చేరని వైనం..
సిద్ధంకాని పెనుకొండ కేంద్రం
సిబ్బంది నియామకం ఎన్నడో..?



5

గందరగోళం!

వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం
ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న విమర్శలు
జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు
కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు



4

అన్నదాతకు ఆయువు పట్టు

- ఎత్తిపోతల పథకంతో వెలుగులు
- 10వేల ఎకరాలకు పైగా ఆయకట్టుగా మార్పు
- మంత్రి పయ్యావుల చొరవతో ప్రతిపాదనలు
- కొట్టాలపల్లి రైతుల హర్షం



ఆయకట్టు భూములుగా మారనున్న పొలాలు

విడపనకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజక వర్గంలోని రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయిల నిధులను కేటాయిస్తోంది. నియోజక వర్గంలోనే లక్ష ఎకరాలకు సాగునీరు అందించి డ్రిప్ ఇరిగేషన్ చేయాలనే సంకల్పంతో మంత్రి పయ్యావుల కేశవ్ అడుగులు వేస్తున్నారు. కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 10వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు 174వ కిలోమీటర్ వద్ద గల హంద్రీనీవా ప్రధాన కాలువ వద్ద ఎత్తిపోతల పంపులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే నియోజకవర్గంలోని 15 గ్రామాలకు చెందిన వర్షాధార భూములు 10వేల ఎకరాలు ఆయకట్టుగా మారనున్నాయి. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు, పీసీ ప్యాపిలి, గడేహోతూరు, చిన్నహోతూరు, చాబాల, ఉరవకొండ మండలంలోని వెలిగొండ, ఉరవకొండ, విడపనకల్లు మండలంలోని కొట్టాలపల్లి, చీకలగురకి గ్రామాలకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందిస్తారు. ఎత్తిపోతల పథకం కాలువ పొడవు 10కిలో మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ భూములకు సాగునీరు అందితే వేల రైతుల కుటుంబాల జీవితాలు మారిపోతాయి. ఎంతో కాలంగా వర్షాధారంపై ఆధారపడి పంటలు పండక, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఎత్తిపోతల పథకం వరంగా మారుతోంది. ఈనెల 9న వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామంలో జరిగిన సభలో మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మా బతుకులు మారిపోతాయి



మా గ్రామంలో ఎక్కడా ఒక్క ఎకరం కూడా ఆయకట్టు లేదు. విడపనకల్లు మండలంలో జీబీసీ కాలువ ఉన్నా మాకు చుక్క సాగునీరు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మాకు సాగునీరు వస్తోందనే సంతోషం కలుగుతోంది. కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే మా గ్రామంలోనూ ఆయకట్టు రైతులు ఉంటారు. మా బతుకులు మారిపోతాయి. ఈ పథకం ద్వారా మా గ్రామంలో వేల ఎకరాలు సాగులోకి వస్తుంది.

- లోకేష్, రైతు, కొట్టాలపల్లి

ఎత్తిపోతల పథకం త్వరగా పూర్తి కావాలి



కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం మా గ్రామం మీదుగా వెళుతుండడంతో మాగ్రామంలోని నాన్ ఆయకట్టు కూడా ఆయకట్టుగా మారేందుకు అవకాశాలు ఉన్నాయి. నీటి పారుదల భూములుగా మారితే రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది. ఆయకట్టుగా మారిన పొలాల్లో మంచి పంటలు పండించేందుకు అనుకులమవుతుంది. హంద్రీనీవా ద్వారా సాగునీరు అందిస్తే మా జీవితాలే మారిపోతాయి. కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం త్వరలోనే పూర్తి కావాలని కోరుకుంటున్నాను.

- గురురాజు, రైతు, వెలిగొండ

వివిధ రకాల పంటలు పండిస్తాం



మా గ్రామం మీదుగా ఎత్తిపోతల పథకం వస్తే వర్షాధార భూములన్నీ ఆయకట్టుగా మారిపోతాయి. దీంతో వివిధ రకాల పంటలు సాగు చేసుకునే అవకాశాలు ఉంటాయి. మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు ఇవ్వాలని ఎత్తిపోతల పథకం మంజూరు చేయించటం ఎంతో సంతోషకరం. సాగునీరు వస్తే ప్రతి రైతు పొలం పచ్చగా మారి మంచి దిగుబడులు వస్తాయి. ఎత్తిపోతల పనులు త్వరలోనే పూర్తి చేసి పూర్తి స్థాయిలో సాగునీరివ్వాలని కోరుకుంటున్నాం.

- తిమ్మప్ప, రైతు, గడేహోతూరు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



కూటమి ప్రభుత్వంలో మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని సంకల్పంతో సీఎంను ఒప్పించి కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం తీసుకురావటం సంతోషదాయకం. ఈ పనులు పూర్తయితే మా గ్రామంతో పాటు నియోజక వర్గంలోని పలు గ్రామాలు సాగు భూములుగా మారుతాయి. రైతుల జీవితాలు మారి ఆర్థికంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- ఈశ్వరయ్య, రైతు, గడేహోతూరు



ఎండలోనే సేదతీరుతున్న కూలీలు

అస్వస్థతకు గురవుతున్న ఉపాధి కూలీలు
నాలుగేళ్లుగా అందని టార్పాలిన్లు
తాగునీరు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిందే

నీడ.. నీరు కరువు

యాడికి, మే 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల వద్ద కూలీలు నీరు, నీడ కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీడ ఏర్పాటు చేసుకునే టార్పాలిన్‌లు పంపిణీ చేయకపోవడంతో పని ప్రదేశాల వద్ద కూలీలకు సేదదీరే వీలు లేకుండాపోయింది. పని ప్రదేశాల వద్ద తాగునీరు కూడా అరకొరగా లభిస్తుండటంతో కూలీలు ఎండదెబ్బ బారిన పడుతున్నారు. నెలరోజుల కిందట యాడికికి చెందిన ఉపాధి కూలీ వడదెబ్బ తగిలి మృతి చెందాడు. గతంలో లక్షుంపల్లిలో ఎండలకు తీవ్ర అస్వస్థతకు గురై పని ప్రదేశంలోనే ఉపాధి కూలీ మృతి చెందాడు. గతంలో ఉపాధి పని ప్రదేశాల వద్ద నీడ ఏర్పాటు చేసుకునేందుకు టార్పాలిన్లు పంపిణీ చేసేవారు. నాలుగేళ్లుగా టార్పాలిన్లు పంపిణీ చేయలేదని కూలీలు తెలిపారు. టీడీపీ హయాంలో కూలీలకు తాగునీటి కోసం డబ్బు చెల్లించేవారని, తర్వాత ఆ ఊసేలేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి బాటిళ్లలో తీసుకెళ్లిన అరకొర నీటినే తాగాల్సి వస్తోందని తెలిపారు. పని ప్రదేశాల వద్ద నీడ, తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



కూలీలు బాటిళ్లలో తెచ్చుకున్న నీరు

వైసీపీ హయాంలో అన్నింటికీ మంగళం

వైసీపీ హయాంలో ఉపాధి కూలీలకు అందించే కనీస వసతులన్నింటికి మంగళం పాడారు. అంతకుముందు కూలీలకు నీడకోసం టార్పాలిన్లు, ప్రథమ చికిత్స కోసం ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, తాగునీటి బిల్లు, గడ్డపారలు, గోళాలు పంపిణీ చేసేవారు. గడ్డపారలు పదును చేయించుకోవడానికి కూడా బిల్లు చెల్లించేవారని కూలీలు తెలిపారు. వైసీపీ వీటన్నింటికీ మంగళం పాడిందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిని పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

ఇంటి నుంచి తెచ్చుకున్న నీరే దిక్కు

ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల వద్ద తాగునీరు చాలినంత లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటినుంచి బాటిళ్లలో తెచ్చుకున్న అరకొర నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో ఎండలకు అస్వస్థతకు లోనవుతున్నాం. పని ప్రదేశాల వద్ద కూలీలకు తగినంత తాగు నీరు అందు బాటులో ఉంచాలి. గతంలో నీటికోసం బిల్లులు చెల్లించేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. గతంలో మెడికల్ కిట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం అవి కూడా ఇవ్వడం లేదు. పనిప్రదేశం వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా చేసుకోలేం.

- రాజు, ఉపాధికూలీ, పిన్నేపల్లి

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



ఉపాధి కూలీలు పనిప్రదేశం వద్ద నీడ ఏర్పాటు చేసుకోవడానికి టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయాలి. నాలుగేళ్లుగా టార్పాలిన్ పట్టలు ఇవ్వలేదు. పని ప్రదేశాల్లో నీడలేక ఎండవేడిమికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేడిని తట్టుకోలేక కొందరు కూలీలు అస్వస్థతకు లోనవుతున్నారు. ఉపాధి పనుల వద్ద నీడ ఏర్పాటుచేసుకోవడానికి టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయాలి.

- రంగమ్మ ఉపాధికూలీ, పిన్నేపల్లి

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు: మద్దిలేటి, ఏపీఓ



ఉపాధి పనుల వద్ద నీడ కోసం గతంలో టార్పాలిన్ పట్టలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం సరఫరా ఆగిపోయింది. గతంలో ఒక్కో కూలీకి రోజుకు 5 లీటర్ల నీటికి బిల్లులు చెల్లించేవారు. నాలుగేళ్లుగా వాటిని ఇవ్వడం లేదు. టీడీపీ హయాంలో ఉపాధి కూలీలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందడానికి పనిప్రదేశం వద్ద మజ్జిగ పంపిణీ చేసేవారు. వీటిపై ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవు.

జిల్లాను తాకిన నైరుతి

ఈసారి ముందస్తుగానే రుతుపవనాలు
మూడురోజుల్లో ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు



అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోకి సోమవారం ఉదయం నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గతేడాదితో పోలిస్తే ముందస్తుగానే ఈసారి జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు వచ్చాయి. గతేడాది మే 29వతేదీ కేరళకు... జూన్ 2న జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ ఏడాది ఈనెల 26న కేరళకు... సోమవారం ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాబోవు మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ సారి ఖరీఫ్‌కు ముందే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు పడితే ఈ సారైనా తమ 'పంట' పండుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం విత్తనకాయల సరఫరా

వద్దన్న రైతులు... పరిశీలించి వెనక్కి పంపిన అధికారులు



నాసిరకంగా ఉన్న విత్తన కాయలను పరిశీలిస్తున్న అధికారులు

కూడేరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వేరుశనగ కాయలు నాసిరకంగా ఉండటంతో రెండు లారీల కాయలను వెనక్కి పంపారు. ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ కాయలను రైతులకు అందించేందుకు సరఫరా చేసిన కాయలు నాసిరకంగా ఉండటంతో రైతులు పరిశీలించి ఈ కాయలు తమకు వద్దని వ్యవసాయ శాఖ అధికారులకు చెప్పారు. కాయలను పరిశీలించిన ఏఓ విజయ్‌కుమార్ విత్తనాల్లో నాణ్యత లేకపోవడంతో వెనక్కి పంపారు. ఖరీఫ్ సీజన్‌లో కూడేరు మండలానికి సుమారు నాలుగు వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలు అవసమరని అధికారులు తెలిపారు. ఆదివారం మండలంలోని కమ్మూరు, గొట్కూరు, తిమ్మాపురం, ముద్దలాపురం, మరుట్ల, కూడేరు, ఉదిరిపికొండ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వేరుశనగ కాయలు సరఫరా చేశారు. దాదాపు 800 క్వింటాళ్ల కాయలు వచ్చాయి. ఆయా గ్రామాల్లో రైతుల సమక్షంలో కాయలను పరిశీలించారు. కమ్మూరు, గొట్కూరు గ్రామాలకు సరఫరా చేసిన విత్తన కాయలు నాసిరకంగా ఉండడంతో వెనక్కి పంపారు. ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనకాయలు నాసిరకంగా ఉంటే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏఓ తెలిపారు.

క్షేత్రస్థాయికెళ్లి సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- తాడిపత్రి పరిష్కార వేదికలో 400 అర్జీలు
- హాజరైన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తాడిపత్రి, మే26(ఆంధ్రజ్యోతి): అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. దాదాపు 400మంది తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు 80శాతం భూసంబంధిత, సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన అర్జీలు వచ్చాయన్నారు. వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఫారెస్ట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రాంమోహన్, మల్లికార్జున, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి.. కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు శాలువాకప్పి, మొమెంటో అందించి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

వ్యవసాయ శాఖ బదిలీల కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న విమర్శలు

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు

కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు

గందరగోళం!



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్, హాజరైన అధికారులు, ఉద్యోగులు



అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఏలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీఏలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీఏ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే న్యాయం చేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కేడర్లలో ఐదేళ్లు పూర్తికాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరికొందరు అధికారుల దరఖాస్తులను పక్కనపెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులు వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల్లో అన్ని కేడర్లలో కొందరు ఉద్యోగులకు ఒక న్యాయం.. మరికొందరికి మరో విధంగా వ్యవహరించడంపై బాధిత వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులు, ఉద్యోగులకు చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండటం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు నిలదీస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీఏ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.

కార్యాలయమే ముద్దు..!

క్షేత్రస్థాయి విధులను ఇష్టపడని పీఆర్ ఇంజనీర్లు

ఉమ్మడి జిల్లాలో 40 మందే మండల ఇంజనీర్లు

వేధిస్తున్న కొరత.. అభివృద్ధి పనులకు ఇబ్బందులు

ఏడాదిగా సేదదీరుతున్న ఇన్‌చార్జి డీఈఈలు

నేడు రాయలసీమ స్థాయిలో బదిలీలకు కౌన్సెలింగ్

అనంతకు రానున్న ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలో పంచాయతీరాజ్ శాఖను ఇంజనీర్ల కొరత వేధిస్తోంది. ఈ సమస్య అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఈ విభాగంపై పట్టున్నవారు క్షేత్రస్థాయి స్థానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కార్యాలయ పనులకే పరిమితమౌతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది అంటే గుర్తుకువచ్చేది మండల ఇంజనీర్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. కోర్టు కేసుల కారణంగా వీరికి ఉద్యోగోన్నతులు కల్పించడం లేదు. దీంతో రెగ్యులర్ డీఈఈల కొరత ఏర్పడింది. సమస్య పరిష్కారం కోసం స్థానిక ఉన్నతాధికారులు వర్కింగ్ అరేంజ్‌మెంట్ కింద పలువురు జేఈఈలకు ఇన్‌చార్జి డీఈఈలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి డీఈఈలు పూర్తిస్థాయిలో ఆ బాధ్యతలను నిర్వర్తించలేకున్నారు. తాము చేయలేక, తమకు సమానమైన జేఈఈలతో పనులు చేయించుకోలేక ఎక్కువ శాతం మండల ఇంజనీర్లపై ఆధారపడుతున్నారు. చాలామంది ఇన్‌చార్జి డీఈఈలు కార్యాలయాలకే పరిమితమౌతున్నారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో కోరుకున్న స్థానాల్లోకి చేరిన పలువురు పనులు మానేసి సేదదీరుతున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదేళ్లు ఒకేచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. కానీ గత ఏడాది ఇన్‌చార్జి డీఈఈలుగా బదిలీపై వచ్చినవారికి ఈ నిబంధనతో పెద్దగా ఇబ్బంది ఉండదని అంటున్నారు.

కదిలించడం సాధ్యమేనా..?

బదిలీల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లతో సోమవారం మధ్యాహ్నం జూమ్‌మీట్ నిర్వహించారు. మండల ఇంజనీర్లు, జేఈఈలు కార్యాలయాల్లో ఉండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి డీఈఈల స్థానాలను సైతం బదిలీల షెడ్యూల్‌లో ఖాళీలుగా చూపించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఏడాదిగా ఇన్‌చార్జి హోదాలో కార్యాలయాలకు పరిమితమైనవారిలో టెన్షన్ మొదలైంది. నాయకుల మద్దతు ఉన్నవారు తమ జోలికి ఎవరూ రారన్న ధీమాలో ఉన్నారు. సిఫార్సులకు తావులేకుండా ఈఎన్‌సీ బదిలీ ప్రక్రియ పూర్తి చేసే అవకాశం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయాల్లో మకాం వేసిన వారిని క్షేత్రస్థాయికి పంపడం సాధ్యమేనా అనే చర్చ జరుగుతోంది.

సిఫార్సుల కోసం..

బదిలీలలో లబ్ధి పొందేందుకు కొందరు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే సిఫార్సు లేఖల కోసం క్యూ కడుతున్నారు. 'ఉమ్మడి జిల్లా సిబ్బందికి సంబంధించి అన్ని నేను చూసుకుంటాను. మీకు ఏది కావాలో చెప్పండి. నేను మాట్లాడతాను' అని శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ ఈఈ భరోసా ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. తన అనుయాయుల కోసం కొన్ని స్థానాలను ఆయన రిజర్వు చేసుకున్నారని అంటున్నారు. ఇప్పటికే పలు విభాలకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో బదిలీలు పూర్తయ్యాయి. విధుల్లో చేరేముందు స్థానిక ప్రజా ప్రతినిధులను కలవడానికి వెళితే.. 'నిన్నెవరు నియమించారు..? నాకు తెలియకుండా నా నియోజకవర్గంలోకి ఎలా వస్తారు..? మీరు వద్దులే.. మా వాళ్లకి ఇప్పటికే లెటర్ ఇచ్చాం' అని అంటున్నట్లు తెలిసింది. దీంతో నానా తంటాలు పడి బదిలీ ఉత్తర్వులు తీసుకున్న వారికి భంగపాటు తప్పడం లేదని అంటున్నారు. పంచాయతీరాజ్‌లో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు.



పంచాయతీరాజ్ ఎస్‌ఈ కార్యాలయం

ఇంజనీర్ల కొరత..

నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు ఒక్కో మండల ఇంజనీరు చొప్పున ఉండాలి. కానీ 40 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన మండలాలకు మండల ఇంజనీర్లే లేరు. ఉన్న వారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి కాలం నెట్టుకొస్తున్నారు. దీంతో ఒక మండలం చూడాల్సిన వారు రెండు, మూడు మండలాలు చూడాల్సి వస్తోంది. ఇది విధులకు ఇబ్బందికరంగా మారింది. అభివృద్ధి పనులకు ఆటంకం ఎదురవుతోంది. ఇలా తంటాడు పడటం కంటే డీఈఈ హోదాలో ఇన్‌చార్జిగా కాలం గడపటమే మేలని చాలామంది భావిస్తున్నారని తెలిసింది. ఉన్నవారిలో కార్యాలయ డీఈఈలుగా కొందరు, క్వాలిటీ కంట్రోల్ విభాగానికి కొందరు, పీఐయూకు కొందరు వెళ్లారు. గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన పీఐయూ జేఈఈ రామచంద్రారెడ్డి ఇన్‌చార్జి పీఐయూ డీఈఈగానే ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఉన్న నారాయణస్వామి జేఈఈ నుంచే ఇన్‌చార్జి డీఈఈగా కొలువుదీరారు. క్వాలిటీ కంట్రోల్ జేఈఈగా ఉన్న కృష్ణజ్యోతి పీఆర్ సబ్ డివిజన్-2 ఇన్‌చార్జి డీఈఈగా కొలువుదీరారు. ఇలాంటివారు చాలామందే ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.

నేడు బదిలీల కౌన్సెలింగ్..

రాయలసీమలోని నాలుగు జిల్లాల పంచాయతీరాజ్ సిబ్బందికి అనంతపురం పీఆర్ ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయంలో ఈఎన్‌సీ బాలు నాయక్ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి తప్పని సరి బదిలీ తథ్యమని అంటున్నారు. అనంతపురం జిల్లాలో ఐదుగురు డీఈఈలు, శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు డీఈఈలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారి జాబితాలో ఉన్నారు.



తప్పనున్న అక్రమ పనిష్మెంట్ల బెడద

సర్క్యులర్ 1/2019 పునరుద్ధరణతో విముక్తి

హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

ఆర్టీసీ ఉద్యోగులకు ఊరట

అనంతపురం కల్చరల్, మే 26(ఆంధ్రజ్యోతి): అక్రమ పనిష్మెంట్ల నుంచి విముక్తి కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వం సర్క్యులర్ 1/2019ను నిర్వీర్యం చేయడంతో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఈనెల 22న సర్క్యులర్ తిరిగి అమలులోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు చొరవతో ఆర్టీసీ అప్పటి ఎండీ సురేంద్రబాబు సర్క్యులర్ 1/2019ను ప్రవేశపెట్టి ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులు తెలిసీ తెలియక చేసిన తప్పులకు సర్క్యులర్ మేరకే పనిష్మెంట్లు ఉండేలా చర్యలు చేపట్టారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. తర్వాత సర్క్యులర్ 1/2019ను పక్కన పెట్టేయడంతో అప్పటి నుంచే ఆర్టీసీ వర్గాల్లో అసహనం మొదలైంది. గడిచిన ఐదేళ్లలో సర్క్యులర్ అమలులో లేని కారణంగా ఉద్యోగులకు ఇష్టారాజ్యంగా పనిష్మెంట్లు విధించడంతో పాటు చాలామందిని సస్పెండ్ చేస్తూ వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే దాదాపు 300 మందికి పైగా ఈ అక్రమ పనిష్మెంట్లకు గురయ్యారంటే సర్క్యులర్ 1/2019 అమలు చేయకపోవడంవల్ల ఆర్టీసీ ఉద్యోగులు ఎంతగా నష్టపోయారో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య వేలల్లోనే ఉంటుంది. డ్రైవర్లు డ్రంకెన్ డ్రైవ్ చేసినపుడు గుర్తించినా, లేదా బస్సు ప్రమాదానికి గురైనా వారికి ఏడాది మొత్తంలో 16 పాయింట్ల వరకు పనిష్మెంట్ నుంచి మినహాయింపు ఇచ్చి, అవి దాటాకే సర్క్యులర్ మేరకు సస్పెండ్ చేసేవారు. వైసీపీ హయాంలో ఏ చిన్న తప్పు దొరికినా పెద్ద పనిష్మెంట్లు వేసేవారు. ఈ క్రమంలో అనంతపురం డిపో పరిధిలోనే ముగ్గురు డ్రైవర్లు సస్పెండ్ అయ్యారు. 2023లో తరిమెల వద్ద వినాయక చవితి ఉత్సవాల సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి వచ్చి ఆర్టీసీ బస్సు కింద పడడంతో ఆ ప్రమాదం విషయంలోనూ సదరు బస్సు డ్రైవర్ ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఇదే అదనుగా జిల్లా స్థాయిలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించిన సందర్భాలూ వెలుగులోకి వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సర్క్యులర్ 1/2019ను ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం తిరిగి అమలులోకి తీసుకురావడంతో.. ఇక నుంచి అక్రమ పనిష్మెంట్ల బెడద ఉండదంటూ ఆర్టీసీ ఉద్యోగులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



మంత్రి లోకేశ్‌కు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు (ఫైల్)

మంత్రి లోకేశ్ చొరవ

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు సర్క్యులర్ 1/2019 అమలు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వచ్చారు. ఇదే అంశంపై ప్రస్తుత ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు దృష్టి సారించారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఆ సమయంలో పూల నాగరాజు మంత్రిని కలిసి సర్క్యులర్ అంశంతోపాటు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, కర్ణాటక బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన లోకేశ్ ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు సూచనలు చేశారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ ఈనెల 22న సర్క్యులర్ 1/2019ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి సానుకూలం



ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి మా ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటోంది. ఉద్యోగుల సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లోపే సర్క్యులర్ అమలుకు చర్యలు చేపట్టడం చూస్తే.. ఉద్యోగుల పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఎంతటి సానుకూలత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగులందరూ ఆర్టీసీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి. అలాగే కార్గో ఆదాయం పెంచడంలోనూ చొరవ చూపాలి.

-పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

ప్రభుత్వానికి ధన్యవాదాలు



సర్క్యులర్ 1/2019తోపాటు మా సమస్యలన్నింటినీ జోనల్ చైర్మన్, కార్మిక పరిషత్ రాష్ట్ర నాయకుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి పలుదఫాలుగా తీసుకెళ్లాం. సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టాం. వాటన్నింటి ఫలితంగా నేడు సర్క్యులర్ 1/2019 అమలులోకి తెచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నాం.

-వాసుదేవరెడ్డి, డ్రైవర్, కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు

మార్కెటింగ్ శాఖలో బదిలీలు

నేడు కమిషనర్ కార్యాలయంలో కౌన్సెలింగ్

అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ మొదలయింది. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఏడీ సత్యనారాయణచౌదరి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లు పూర్తయిన వారు 22 మంది ఉన్నట్లు వివరించారు. ఇందులో ఇద్దరు యూడీసీలు, 11 మంది సూపర్‌వైజర్లు, ఇద్దరు ఏఎంఎస్‌లు, ఒక ఎల్‌డీసీ, ఇద్దరు బిడ్‌క్లర్క్‌లు, ఒక గ్రేడర్, ఒక అటెండర్, ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఒకేచోట ఐదేళ్లు పూర్తి కానివారు కూడా బదిలీల కోసం మరో 23 మంది రిక్వెస్టు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు కౌన్సెలింగ్‌కు ఉద్యోగులు, సిబ్బంది సోమవారం రాత్రి విజయవాడకు పయనమయ్యారు.

92 మంది వెటర్నరీ సిబ్బందికి కౌన్సెలింగ్

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న 92 మంది సిబ్బందికి సోమవారం స్థానిక జేడీ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జేడీలు వెంకటస్వామి, శుభదాస్.. ఆఫీస్ సబార్డినేట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, డ్రైవర్లకు ఆప్షన్ల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలు ఖరారు చేశారు. వెటర్నరీ డాక్టర్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, జూనియర్, సీనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏడీలు, డీడీల దరఖాస్తులను పరిశీలించి, రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపినట్లు జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు.

నేడు గ్రేడ్-2 హెచ్ఎం ప్రమోషన్లకు వెరిఫికేషన్

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లకు సీనియారిటీ జాబితాలోని పీఎస్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్ల కోసం టీచర్ల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను అనంతపురం డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాలోని ప్రైమరీ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, ఎస్సీ ఉపాధ్యాయులు కుల ధ్రువీకరణ పత్రాలు, పీహెచ్ టీచర్లు ఒరిజినల్ పత్రాలతోపాటు మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు, ఎస్ఆర్ బుక్స్‌తో రావాలన్నారు. అనంతపురం నగరంలోని శారదా మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

విద్యాశాఖలో 11 బృందాల ఏర్పాటు

- బదిలీలు, ప్రమోషన్ల కోసం నియామకం
- సభ్యులుగా ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు
- ఒక్కో టీంకు 4 నుంచి 8 మండలాల బాధ్యతలు

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారులతో 11 బృందాలను నియమించారు. ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఇతర రెండు జిల్లాల విద్యాశాఖ క్లరికల్ స్టాఫ్‌తో కలిపి 11 టీమ్స్ ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, ఐటీ సెల్ సిబ్బంది, టెక్నికల్ స్టాఫ్ సభ్యులుగా ఉంటారు. ఒక్కో బృందానికి 4 నుంచి 8 మండలాల వరకూ కేటాయించారు. బదిలీలు, ప్రమోషన్లు, స్కూళ్ల పునర్విభజన, హేతుబద్ధీకరణపై ఉపాధ్యాయుల నుంచీ వచ్చే అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. 63 మండలాలను 11 కౌంటర్లుగా విభజించారు. ప్రత్యేకంగా కేటాయించిన కౌంటర్లలో సంబంధిత మండలాల టీచర్లు తమకు ఎదురయ్యే సాంకేతిక, ఇతర సర్వీస్ సమస్యలు, వినతులను కౌంటర్ ఇన్‌చార్జిలు, ఇతర ఎంఈఓలు, టెక్నికల్ పర్సన్ల దృష్టికి తీసుకెళ్లేలా అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు బృందాలను నియమించారు.

టీం	మండలాలు	కౌంటర్ ఇన్‌చార్జిలు	అలాటెడ్ పర్సన్స్	టెక్నికల్ సిబ్బంది
1	అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం	క్రిష్ణయ్య (ఏడీ), ఆదినారాయణ (సూపరింటెండెంట్)	హరికృష్ణ (ఎంఈఓ-2), అనిల్ (క్లర్క్)	మారుతి (ఎస్‌జీటీ)
2.	కూడేరు, నార్పల, పెద్దపప్పూరు, శింగనమల, రాప్తాడు, పుట్లూరు	క్రిష్ణయ్య(ఏడీ), సరళ (సూపరింటెండెంట్)	నారపరెడ్డి(ఎంఈఓ-2), మారుతీసుధాకర్ (ఎస్ఏ)	మారుతి (ఎస్‌జీటీ)
3.	తాడిపత్రి, యల్లనూరు, గుత్తి, గుంతకల్లు	క్రిష్ణయ్య(ఏడీ) ఆదినారాయణ (సూపరింటెండెంట్)	మదన్(ఎంఈఓ-2), షబీనా, హరిక్రిష్ణ (ఆఫీస్ స్టాఫ్)	మంజునాథ్ (ఏపీఓ)
4.	పెద్దవడుగూరు, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి, వజ్రకరూరు	క్రిష్ణయ్య(ఏడీ) శాంతకుమారి (సూపరింటెండెంట్)	సాయిక్రిష్ణ(ఎంఈఓ-2), జిలాన్, రాజేష్ (ఆఫీస్ స్టాఫ్) వెంకటరమణ(ఎంఈఓ-2), చంద్రకాంత్, హనుమంతు	మంజునాథ్ (ఏపీఓ) గురుమునిక్రిష్ణ
5.	బెలుగుప్ప, బొమ్మనహాల్, డీ హీరేహాళ్ బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం	క్రిష్ణయ్య (ఏడీ) ఆదినారాయణ (సూపరింటెండెంట్)		
6.	కంబదూరు, కణేకల్లు, కుందుర్పి, రాయదుర్గం, శెట్టూరు	క్రిష్ణయ్య(ఏడీ) సరళ (సూపరింటెండెంట్)	మోహన్‌బాబు(ఎంఈఓ-2), గాయత్రి, రామ్మోహన్	గురుమునిక్రిష్ణ
7.	బత్తలపల్లి, సీకేపల్లి, ధర్మవరం కనగానపల్లి, ముదిగుబ్బ, రామగిరి తాడిమర్రి	శ్రీనివాసరావు (ఏడీ) కామరాజ్ (సూపరింటెండెంట్)	ప్రసన్నకుమార్(ఎంఈఓ-2), సురేష్‌కుమార్, సాయినాథ్	మస్తాన్ ఖాన్
8.	అమడగూరు, గాండ్లపెంట, కదిరి నల్లచెరువు, తలుపుల	శ్రీనివాసరావు(ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్)	నరేంద్ర(హెచ్ఎం), శ్యాంకుమా ర్, ఆరిఫ్	మస్తాన్ ఖాన్
9.	అగళి, అమరాపురం, చిలమత్తూరు గుడిబండ	శ్రీనివాసరావు (ఏడీ) కామరాజ్(సూపరింటెండెంట్)	వెంకటేశులు(ఎంఈఓ-2), చక్రధర్, శివకుమారి	చంద్రమోహన్, ఏఎస్ఓ
10.	లేపాక్షి, మడకశిర, పరిగి, రొద్దం పెనుకొండ	శ్రీనివాసరావు (ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్)	సుధాకర్ (ఎంఈఓ-2), జయరాం (ఏపీఓ), లోకేశ్	చంద్రమోహన్, ఏఎస్ఓ
11.	రొళ్ల, సోమందేపల్లి, గోరంట్ల బుక్కపట్నం, కొత్తచెరువు, ఓడీసీ నల్లమాడ, పుట్టపర్తి	శ్రీనివాసరావు (ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్)	శ్రీదేవి (ఎంఈఓ-2), నాగరాజు (క్లర్క్)	ప్రకాష్‌రెడ్డి (ఎస్‌జీటీ)

భూసందేహ పరీక్షలు..!

మట్టి నమూనాల సేకరణలో తీవ్ర జాప్యం

సగం కూడా పూర్తికాని దుస్థితి

సేకరించినవీ.. ల్యాబ్‌కు చేరని వైనం..

సిద్ధంకాని పెనుకొండ కేంద్రం

సిబ్బంది నియామకం ఎన్నడో..?



ముదిగుబ్బ మండలం బ్రాహ్మణపల్లి పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది



మట్టి నమూనాలు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న అనంతపురం భూసార పరీక్ష కేంద్రం ఆవరణం

అనంతపురం అర్బన్/ధర్మవరం/కొత్తచెరువు/పెనుకొండ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భూసార పరీక్షలు సవ్యంగా సాగేనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి నమూనాల సేకరణలో తీవ్ర జాప్యమవుతోంది. సేకరించిన వాటిల్లో ఒక్కటి కూడా భూసార పరీక్షాకేంద్రాలకు పంపలేదు. పెనుకొండ పరీక్షాకేంద్రానికి ఇంకా మరమ్మతులు చేస్తున్నారు. సిద్ధం కూడా కాలేదు. పరీక్షలు చేయడానికి సిబ్బంది లేరు. సిబ్బందిని నియమించేదెపుడు, మట్టి పరీక్షలు చేసేటపుడు, వాటి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేదెపుడన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్యం 48,266..


ఉమ్మడి అనంత జిల్లాకు ఈసారి 48,266 భూసార పరీక్షలు చేయాలని టార్గెట్ విధించారు. ఇందులో అనంతకు 25,107, శ్రీసత్యసాయి జిల్లాకు 23,159 భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆశించిన మేరకు పలు మండలాల్లోని రైతు సేవాకేంద్రాల పరిధిలో మట్టినమూనాలు సేకరించడం లేదన్న విమర్శలున్నాయి. గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో రైతులు భూసార హెల్త్ కార్డులకు దూరమయ్యారు. దీని ప్రభావం పంట దిగుబడులపై పడటంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించడంతోపాటు భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంది. మరి ఏ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

విత్తుకు సిద్ధమవుతున్న రైతులు

గతేడాదితో పోలిస్తే ఈసారి ముందస్తుగానే సోమవారం ఉదయం జిల్లాలోకి నైరుతిరుతు పవనాలు ప్రవేశించాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుప్రాంతాల్లో రైతులు సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షం పడితే విత్తనం వేసేందుకు ఆయా రైతులు సిద్ధం చేశారు. వర్షం పడి పొలం ఆరిన తర్వాతనే మట్టినమూనాలు తీయాలి. విత్తనం వేసిన తర్వాత మట్టి నమూనాలు తీసే అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని, నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. లేదంటే లక్ష్యం మేరకు మట్టి పరీక్షలు నిర్వహించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది. 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఒక్క భూసార పరీక్ష కూడా నిర్వహించలేదు. 2023-24లో 10వేలు, 2024-25లో 18,600 భూసార పరీక్షలతో సరిపెట్టారు. టీడీపీ హయాంలో భూసార పరీక్షలు చేయడంతోపాటు ప్రత్యేకంగా రైతులకు భూసార హెల్త్ కార్డులు జారీ చేస్తూ వచ్చారు. వైసీపీ పాలనలో భూసార హెల్త్‌కార్డుల జారీని పూర్తిగా నిలిపేశారు. భూసార పరీక్షల ద్వారా పొలాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ ధాతువులు జింక్, మాంగనీస్, కాపర్, బోరాన్ తదితర పోషకాలు ఏ పరిమాణంలో ఉన్నాయో తెలుస్తుంది. భూసార పరీక్షల ద్వారా ఆయా పొలాల్లో ఏయే రకాల పంటలు పండించవచ్చో తెలుసుకోవచ్చు. భూసార పరీక్షల ద్వారా సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడి వస్తుంది. వైసీపీ పాలనలో భూసార పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు ఎడాపెడా పొలాల్లో ఎరువులు వాడటం ద్వారా భూముల్లో సమతుల్యత లోపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పెనుకొండ భూసార పరీక్షా కేంద్రంలో మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

● నమూనాల సేకరణలో నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలోని పలు రైతుసేవా కేంద్రాల పరిధిలో నిర్దేశించిన మేరకు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత నెల 25వ తేదీ నుంచి మే నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షాకేంద్రానికి పంపాలి. అక్కడ ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా సాయిల్ హెల్త్ యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ముందుగా రైతు సేవాకేంద్రంలో సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో మట్టి నమూనాలు సేకరించే ఆయా పొలాల రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆర్ఎస్‌కే సిబ్బంది క్షేత్ర స్థాయిలో పొలాల్లోకి వెళ్లి రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు తీయాలి. అక్కడే జీపీఎస్ కో-ఆర్డినేట్‌తో సదరు రైతుతో సెల్ఫీ దిగి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇప్పటిదాకా అనంతలో 11 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో 12,130 మట్టి నమూనాలు సేకరించారు. మిగతా వాటిని ఎప్పటిలోగా సేకరిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

పరీక్షా కేంద్రాలకు చేరని మట్టి నమూనాలు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలను అనంతపురం భూసార పరీక్షాకేంద్రానికి పంపేవారు. ఈ ఏడాది శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలను పెనుకొండ భూసార పరీక్షాకేంద్రానికి పంపించి, అక్కడే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటిదాకా అనంతపురం, పెనుకొండ భూసార పరీక్షాకేంద్రాలకు ఒక్క మట్టినమూనా కూడా చేర్చకపోవడం గమనార్హం. గత వైసీపీ పాలనలో ధర్మవరం, పెనుకొండ భూసార పరీక్షా కేంద్రాలు మూతపడ్డాయి. ఈ ఏడాది నుంచి పెనుకొండ భూసార పరీక్షాకేంద్రంలోపరీక్షలు చేయాలని నిర్ణయించడంతో ప్రస్తుతం మరమ్మతు పనులు చేసి, పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. అక్కడి భూసార పరీక్షాకేంద్రానికి కావాల్సిన ఏఓలు, ఇతర సిబ్బందిని ఇంకా నియమించలేదు. తగిన పరికరాలు, కెమికల్స్ కోసం ప్రతిపాదనల దశలోనే ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పెనుకొండలో ఎప్పటి నుంచి భూసార పరీక్షలు ప్రారంభిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. భూసార పరీక్షలు సవ్యంగా సాగకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. అనంతపురం భూసార పరీక్షాకేంద్రంలోనూ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ సిబ్బందిని డైలీ లేబర్ కింద ఇంకా తీసుకోలేదు. మట్టి నమూనాలు వచ్చిన తర్వాత సిబ్బందిని తీసుకుంటామని ఆ శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఆధారంగా తగిన మోతాదులో ఎరువులు వాడుకుంటే.. పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగా పెరుగుతాయి. అందుకే ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. రైతు సేవాకేంద్రంలో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలకు వచ్చి రైతుల సమక్షంలోనే మట్టినమూనాలు సేకరించి, పరీక్షాకేంద్రానికి పంపుతారు. భూసార పరీక్షాకేంద్రంలో మట్టి పరీక్షలు నిర్వహించి, రైతులవారీగా ఆన్‌లైన్‌లో భూసార పరీక్షల ఫలితాలు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించి, పరీక్షా కేంద్రానికి పంపేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-సుబ్బారావు, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ శాఖాధికారి

మేమింతే.. మారమంతే..!

కాసుల కోసం మద్యం వ్యాపారులతో దోస్తీ

రేటు పెంచుకో...

మామూళ్లు ఇచ్చుకో..

ఎక్సైజ్ అధికారుల భరోసా

సివిల్ పోలీసులదీ అదే దారి

తనిఖీలకు మంగళం



అనంతపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా.. మద్యం పాలసీ మారినా.. ఎక్సైజ్ అధికారుల తీరుమారలేదు. మేమింతే.. మారమంతే.! అన్న చందంగా వారి వ్యవహార శైలి ఉంది. మద్యం పాలసీలో ప్రభుత్వ నిబంధలను అమలు చేయాల్సిన అధికారులు కాసుల కోసం షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకొని, కుమ్మక్కవుతున్నారు. రేటు పెంచుకో.. నెల మామూళ్లు ఇచ్చుకో అనే రీతిన ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఆ శాఖాధికారులు పనితీరు ఉందన్న విమర్శలు ఉన్నాయి. సివిల్ పోలీసులు అదే దారి పట్టారు. ఎక్సైజ్, సివిల్ పోలీసులకు నెల మామూళ్లు ఇవ్వాలన్న సాకుతో మద్యం దుకాణాల నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.10, బీరుపై రూ.10, ఫుల్ బాటిల్‌పై ఏకంగా బ్రాండ్‌ను బట్టి రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. నెల మామూళ్లు ముడుతుండడంతో నియంత్రించాల్సిన అధికారులు కిమ్మనడం లేదు. అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయాలు జరిపిన నేపథ్యంలో మందుబాబుల నుంచి ఏ విధమైన వ్యతిరేకత వ్యక్తమైందో.. ప్రస్తుతం అదే పరిస్థితి కనిపిస్తోంది. పాలకులకు తెలిసినా మిన్నకుండిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వర్గాలకు వాటాలు వెళుతున్నాయేమోనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతి దుకాణం నుంచి మామూళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతి మద్యం దుకాణం నుంచి ఎక్సైజ్ అధికారులు నెల మా మూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి ఏకంగా నెలకు రూ.40 వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో హోదాలను బట్టి పంపకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో బార్ నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల దాకా వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సం బంధించి 243 మద్యం దుకాణాలు ఉండ గా... సగటున నెలకు మామూళ్ల రూపంలో ఎక్సైజ్‌శాఖకు రూ.కోటి దాకా మద్యం దుకాణాల నిర్వాహకులు ముట్ట జెబుతున్నట్లు ఆ వర్గాలే బాహాటంగా చెప్పుకుంటున్నాయి. ఇక 29 బార్లకుగాను నెలకు సగటున రూ.9 లక్షలదాకా మామూళ్ల రూపంలో చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నట్లు సమాచారం.

సివిల్ పోలీసులదీ అదే దారి..!

మద్యం పాలసీ నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉంది. ఆ శాఖ అధికారులు ఆ బాధ్యతను విస్మరించి నెల మామూళ్లకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న ఆరోపణలు నేపథ్యంలో.. సివిల్ పోలీసులు మ ద్యం దుకాణాలపై కన్నెత్తి చూడటం లేదు. ఎక్సైజ్ అధికారుల బాటలోనే సివిల్ పోలీసులు అదే దారిని ఎంచుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో మ ద్యం దుకాణం నుంచి మండల కేంద్రాల్లో నెలకు రూ.15వేలు, ప ట్టణాల్లో రూ.25వేల దాకా మా మూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం దుకాణాల నిర్వాహకులు ఎమ్మార్పీలకు మంగళం పాడారనే విమర్శలు ఉన్నాయి.

వ్యాపారుల చేతివాటం

మద్యం దుకాణాల నిర్వహణలో.. మద్యం పాలసీ నిబంధనలకు తూట్లు పొడిచినా.. ఎమ్మార్పీ కంటే అదనంగా విక్రయించినా.. అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసు అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్న ధీమాతో మద్యం దుకాణాల నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మద్యం దుకాణాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా బెల్ట్ షాపులు నిర్వహించుకునేందుకు నిర్వాహకులే తెరతీశారు. ఒక్కో బెల్ట్ షాపు నిర్వహణ, మద్యం సరఫరా చేసినందుకుగాను రూ.50వేలు బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వసూలు చేసినట్లు సమాచారం. కొత్తగా బెల్ట్ షాపు పెట్టుకోవాలంటే... ఆ మద్యం దుకాణం నిర్వాహకులకు రూ.50వేలు ముట్టజెబితేనే మద్యం సరఫరా చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,800 దాకా బెల్ట్ షాపులు ఏర్పడినట్లు తెలుస్తోంది.

తనిఖీలకు మంగళం

ఎమ్మార్పీలకే మద్యం విక్రయించాలి.. బెల్ట్ షాపుల నియంత్రణ, నిర్దేశించిన సమయంలోనే దుకాణాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నెల మామూళ్ల ఒప్పందం నేపథ్యంలో తనిఖీలకు మంగళం పాడారన్న విమర్శలు ఉన్నాయి. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మద్యం దుకాణం వద్ద అనధికారికంగా పర్మిట్ రూంలు వెలిశాయి. వీటి నియంత్రణను గాలికి వదిలేశారు. ఆకస్మిక తనిఖీలు... డకాయ్ ఆపరేషన్‌లకు చెల్లుచీటీ పాడారు. ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణ గాడి తప్పడానికి కాసుల వ్యవహారమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ వ్యవహారాలన్నీ చక్కదిద్ది ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పాలకులు, జిల్లా యంత్రాంగం ఏ మేరకు దృష్టి సారిస్తుందో చూడాలి.

చిల్లకొండయ్యపల్లి వద్ద పుర్రె లభ్యం



పుర్రెను పరిశీలిస్తున్న పోలీసులు

తాడిమర్రి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లి సమీపంలో సోమవారం గొర్రెల కాపరులు ఓ పుర్రెను గుర్తించారు. ఆదివారం సాయంత్రమే కొందరు అక్కడ ఓ సంచి ఉన్నట్లు చూశారు. సోమవారం ఉదయం వెళ్లే సరికి సంచి సమీపంలో పుర్రె పడి ఉండటాన్ని గమనించి గ్రామస్థులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్ఐ క్రిష్ణవేణి, ఏఎస్ఐ సూర్యనారాయణరాజుతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి పుర్రెను అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా పుర్రె పురుషులదా స్త్రీలదా అన్నది తెలుస్తుందన్నారు. పుర్రెకు సంబంధించిన మొండెం సమీపంలో ఎక్కడా కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పుర్రెను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి సంచిలో ఉంచి అక్కడ పడవేసినట్టుగా తెలుస్తోంది.

సెలవులోకి డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ 27 రోజులపాటు వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. తిరిగి జూన్ 22న ఆయన విధుల్లో చేరనున్నారు. కర్నూలు డీఎఫ్ఓ శ్యామలకు జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు.

దరఖాస్తు చేసుకోండి..!

అనంతపురం సెంట్రల్, మే26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఏపీటీడబ్ల్యూఆర్) పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి అంజేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి మూడు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) సామాజికవర్గానికి చెందిన బాలబాలికలు అర్హులన్నారు. ఖాళీ సీట్లకంటే అధికంగా దరఖాస్తులు వస్తే.. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో లాటరీ తీస్తామన్నారు. జూన్ 4వతేదీన లాటరీ ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశానికి..

గుత్తి మండలం గొల్లలదొడ్డిలోని గిరిజన గురుకుల పాఠశాల(బాలురు)లో ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియను చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 2025-26 మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9885369079, 8978239363, 8341603090 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పథకాల లబ్ధికి పోస్టల్ ఖాతాలు

31 నుంచి ప్రత్యేక శిబిరాలు

తపాలాశాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ

అనంతపురం సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేందుకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతాలు వర్తిస్తాయని తపాలాశాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో సోమవారం అసిస్టెంట్ సూరింటెండెంట్ ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలకోసం వ్యయప్రయాసలకోర్చి పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోస్ట్‌బ్యాంకు ఖాతాదారులు వారి ఇంటి వద్ద నుంచే తపాలా ఉద్యోగుల ద్వారా సేవలు పొందవచ్చన్నారు. కొత్తగా పోస్ట్‌బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఈనెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రత్యే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్ట్ బ్యాంకు ఖాతాదారులు 13,480 మందికి ఎన్‌పీసీఐ లింక్ కాలేదన్నారు. వారందరికీ ఆధార్ సీడింగ్ ద్వారా ఎన్‌పీసీఐ లింక్ చేయిస్తామన్నారు. సాధారణ రోజుల్లోనూ ఆధార్ సీడింగ్‌తో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు పొదుపు ఖాతాలు చేయిస్తామన్నారు. 18ఏళ్లు పైబడిన వారందరూ అర్హులనీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని కోరారు.

చీనీ టన్ను రూ.34 వేలు



అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 788 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సౌదీలో చిక్కుకున్న ధర్మవరం యువకుడు

స్వదేశానికి రప్పించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్యలు

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): సౌదీఅరేబియాలో చిక్కుకున్న ధర్మవరం యువకుడిని స్వదేశానికి రప్పించేందుకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి హరీశ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన సయ్యద్ ఫారూక్ ఇటీవల ఉపాధి కోసం సౌదీఅరేబియాకు వెళ్లి, అక్కడే బందీగా ఉండిపోయాడు. పుట్టపర్తికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా డ్రైవర్ ఉద్యోగం కోసం వెళ్లిన ఫారూక్ అక్కడ చిక్కుకున్నారు. ఆహారం, నివాసం లేకుండా, జీతాలులేని దయనీయ పరిస్థితిలో ఉన్నాడు. ఫారూక్ పాస్‌పోర్టును కూడా స్వాధీనం చేసుకుని, ఇబ్బందులకు గురిచేస్తున్నారని అతడి కుటుంబసభ్యులు.. హరీశ్‌బాబుకు చెప్పారు. ఆయన వెంటనే మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి.. కేంద్రవిదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్‌కు లేఖ రాశారు. అందులో మంత్రి మూడు కీలక అంశాలను పేర్కొన్నారు. ఫారూక్‌కు ప్రాణరక్షణ కల్పించాలనీ, అతడి పాస్‌పోర్టు తిరిగి ఇప్పించాలనీ, భారత దౌత్య కార్యాలయం ద్వారా నిరంతరం కమ్యూనికేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫారూక్‌ను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హరీశ్‌బాబు స్పష్టం చేశారు.

గూగూడు బ్రహ్మోత్సవాలపై సమీక్ష

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలపై సోమవారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు సమీక్ష నిర్వహించారు. ఆలయ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారన్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేత ఆలం వెంకటనరసానాయుడు, మండల నాయకులు ఆకుల ఆంజనేయులు, దేవదాయ శాఖాధికారులు, కమిటీ సభ్యులు, అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

న్యూస్ బాక్స్

కుమ్మరి శాలివాహనుల సమస్యలపై దృష్టి పెట్టండి

● చైర్మన్‌కు నాయకుల వినతి


చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): కుమ్మరి శాలివాహనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉమ్మడి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు కోరారు. ఆ మేరకు సోమవారం కర్నూల్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కుమ్మర శాలి వాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావును టీడీపీ కుమ్మర శాలివాహన సంఘం శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజినేలుతో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు కలిశారు. చైర్మన్‌గా ఎంపికైనందుకు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కుమ్మర శాలి వాహన భవన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నాయకులు ఓబుళపతి, గోపాల్, ఆంజనేయులు, మలరాయుడు, రామకృష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ : ఏఓ

రాప్తాడు, మే 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీవాణి తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసే విత్తన వేరుశనగ కాయలు 300 బ్యాగులు (90 క్వింటాళ్లు) రాప్తాడుకు చేరాయి. వాటిని వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. కాయలు నాణ్యంగా ఉన్నాయన్నారు. త్వరలోనే ధర ఖరారు చేసి రైతులకు పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ముత్యాలు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, ఏఈఓ రంజిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుకోట హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

ఆంధ్రజ్యోతి ఏరియా వాచ్

అనంతపురం విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యానికి జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఉపాధ్యాయల బదిలీల దరకాస్తులను స్క్రూటినీ చేయాల్సిన కీలక సమయంలో హెచ్‌ఎం సుబ్రమణ్యం అందుబాటులో లేరు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం హెచ్‌ఎం సుబ్రమణ్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

దాడిపై కేసు

అనంతపురం క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితుడిపై దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. భాగ్యనగర్‌కు చెందిన భరత్, అతడి స్నేహితుడు ఫక్రుద్దీన్ ఆదివారం రాత్రి ఓ మద్యం దుకాణంలో మద్యం తాగారు. అనంతరం గుత్తిరోడ్డులోకి బైక్‌లో డ్రాప్ చేయమని ఫక్రుద్దీన్ కోరగా, భరత్ గుత్తి రోడ్డులోని పెట్రోల్ బంక్ దగ్గర డ్రాప్ చేశాడు. గతంలో ఉన్న మనస్పర్థల నేపథ్యంలో భరత్‌పై ఫక్రుద్దీన్ దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు భరత్ చేసిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా కార్యవర్గానికి సత్కారం

అనంతపురం సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఘనంగా సత్కరించారు. అధ్యక్ష, కార్యదర్శులు గోపికృష్ణ, రామునాయక్‌ను ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు గజమాలతో సన్మానించారు. ఆయుష్ ఉద్యోగులు సత్యప్రసాదరావు, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, సునీల్‌బాబు, నాగరాజు, ఈశ్వరయ్య, తిమ్మరాజు, వరప్రసాద్, శివశంకర్, మహేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

రాప్తాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను కొన్ని నెలలుగా వేధించాడని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కదిరికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. కదిరికి చెందిన యువకుడు మండల కేంద్రంలో చెరుకు బండి పెట్టుకుని జీవనం సాగించేవాడని సీఐ తెలిపారు.

దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాల ఆవిష్కరణ

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలుగులో రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాలను సోమారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆ సమితి ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, లీగల్ సలహాదారుడు జెన్నే ఆనంద్, అనంత జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకులు సుధాకర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఫాం పాండ్ పనులకు భూమి పూజ


పనులను ప్రారంభిస్తున్న సర్పంచు డేగల లలితమ్మ, డేగల కృష్ణమూర్తి

శింగనమల, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు డేగల లలితమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని గుమ్మేపల్లిలో ఉపాధి పథకం ద్వారా చేపట్టనున్న ఫాం పాండ్ పనులను సోమవారం సర్పంచు డేగల లలితమ్మ, డేగల కృష్ణమూర్తి భూమి పూజ చేసి ప్రా రంభించారు.

'యోగాతో మానసిక ప్రశాంతత'


యోగాసనాలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): యోగా వల్ల మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని కనుముక్కల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి రత్నచిరంజీవి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని కనుముక్కలలో సోమవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకురాలు షకీల ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి అలివేలుమంగమ్మ, ఏఎస్‌ఎంసునీత, ఆశాకార్యకర్తలు గౌతమి, సరస్వతి పాల్గొన్నారు.

జగన్ ఇలాఖాలో పసుపు సైన్యం బలం చూపుదాం

● 120 బస్సులు, వంద వాహనాల్లో మహానాడుకు వెళ్దాం
● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఇలాఖాలో పసుపు సైన్యం బలం చూపిద్దామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో, ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మహానాడు సమన్వయ కర్త ఆకాశపు స్వామి, నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి పలువురు ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల జరిగిన అర్బన్ నియోకవర్గం మినీ మహానాడుకు 14 గంటల ముందు పిలుపునిస్తే.. ఆరు వేల మందికి పైగా హాజరై విజయవంత చేశారి పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి మహానాడుకు అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళదామని పిలుపునిచ్చారు. ఇందు కోసం 120 బస్సులు, మరో 100 వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎనిమిది వేల మందికిపైగా మహానాడుకు తరలివెళ్లేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. మహానాడుకు వెళ్లే ప్రతి కార్యకర్త మెడలో టీడీపీ సభ్యత్వ కార్డు ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

సీనియారిటీ జాబితాలో తప్పులు సవరించండి

● డీఈఓకు పీఆర్టీయూ, ఆర్‌యూపీపీ నేతల వినతి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల సీనియారిటీ జాబితాలో దొర్లిన తప్పులను వెంటనే సరిదిద్దాలని పీఆర్టీయూ, ఆర్‌యూపీపీ నాయకులు డీఈఓను కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, ఇతర నాయకులు రజనీకాంత్, రంగారెడ్డి, ఆర్‌యూపీపీ నాయకులు హనుమేష్ సోమవారం డీఈఓ ప్రసాద్ బాబును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇటీవల విడుదలైన జీవోలు 21, 22కు అనుగుణంగా చేపడుతున్న ప్రమోషన్లు, బదిలీల్లో పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితా చాలా అసంబద్ధంగా తయారు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెరిట్ లేదా మెరిట్ కం రోస్టర్ మేరకు సీనియారిటీ లిస్టు రెడీ చేయాల న్నారు. అందుకు తిలోదకాలు ఇవ్వడం సరికాదని, అర్హులకు న్యాయం జరి గేలా చూడాలన్నారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు.

'ఇంగ్లీష్ అసిస్టెంట్ల ఖాళీలు తగ్గించరాదు'

● అనంతపురం విద్య: స్కూల్ అసిస్టెంట్స్ (ఇంగ్లీష్) ప్రమోషన్ల కోసం ఖాళీలు తగ్గించరాదని పలు సంఘాల నాయకులు, సీనియర్ ఎస్‌జీటీలు డీఈఓను కోరారు. ఇంగ్లీష్ ఎస్‌ఏ ప్రమోషన్స్ ఆశావహులు పలువురు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఉమ్మడి జిల్లాలో 2023లో సీనియర్ ఎస్‌జీటీలకు ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లుగా తాత్కాలిక పదోన్నతులు ఇచ్చారన్నారు. రూ. 2500 అలవెన్సుతో ఏప్రిల్ వరకు వారితో పనిచేయించుకున్నారన్నారు. అయితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో తర్వాత ఇచ్చిన ప్రమోషన్లలో అనంతపురం జిల్లాలో ఇంగ్లీష్ ఎస్‌ఏల ప్రమోషన్లు ఆగిపోయాయన్నారు. కోర్టు కేసులు పరిష్కారమయ్యాయని, ప్రస్తుతం ఇచ్చే ప్రమోషన్లలో 230 ఖాళీలకు తగ్గకుండా ఇంగ్లీష్ ఎస్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. నాయకులు సూర్యుడు, నాగభూషణం, జయరాంనాయక్, కేశవరెడ్డి, సిరాజుద్దీన్, శ్రీనివాసులు నాయక్, శ్రీదేవి, విజయశ్రీ, సురేష్, కృష్ణారెడ్డి, పీరు నాయక్, వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ వైద్యుడి దుర్మరణం

● డివైడర్‌ను ఢీ కొనడంతో మృతి చెందిన అనంత వాసి

బంగారపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం సిద్దనహళ్ళి సమీపాన బెంగళూరు - చెన్నై కారిడార్‌పై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన ఓ యువ వైద్యుడు దుర్మరణం చెందారు. అనంతపురానికి చెందిన కృష్ణ జగన్ (25) తెల్లవారుజామున అనంతపురం నుంచి బెంగళూరు మీదుగా కుప్పం వెళ్తున్నారు. కర్ణాటక రాష్ట్ర బంగారపేట తాలూకాలోని సిద్దనహళ్ళి వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. తీవ్ర గాయాలపాలైన కృష్ణజగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుప్పంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో అనంతపురం వచ్చి తిరిగి సోమవారం ఆసుపత్రికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. బంగారపేట సీఐ దయానంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.


నుజ్జునుజ్జయిన కారు

'90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి'


ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో సాగు కోసం రైతులకు 90 సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సూక్ష్మపోషకాలు అందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మాట్లాడుతూ....జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 90 శాతం కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం ఎదరు చూస్తున్నారని పేర్కొన్నారు. ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిరకాల విత్తనాల ధరలు పెంచాయన్నారు. పైగా బయట మార్కెట్‌లో నాసిరకం, కల్తీ విత్తనాలు రైతులకు అంటగడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ.... అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ సీజన్‌లోనే రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వన్నారెడ్డి, నారాయణస్వామి, వెంకటరాముడు, రామాంజినేయులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాకర్ చౌదరి పుట్టిన రోజు వేడుక


వైకుంఠం ప్రభాకర్ చౌదరికి కేక్ తినిపిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రభాకర్ చౌదరి భారీ కేక్ కట్ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నటేష్ చౌదరి, నాయకులు బంగి నాగ, మాజీ కార్పొరేటర్లు విజయశ్రీరెడ్డి, జానకి, రాధా, మార్కెట్ మహేష్, గౌస్‌పీరా, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటేష్ చౌదరి, శ్రీధర్, చంటి, శిల్పా, వసుంధర, హసీనా, కొండయ్యతోపాటు రాజీవ్ కాలనీ, మరాఠీ కాలనీ వాసులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దళితుల భూ ఆక్రమణలను నిలువరించేదెవరు?

● ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

అనంతపురం సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా దళితుల భూములు ఆక్రమితమవుతున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడంలేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలు నిలువరిం చేదెవరని ప్రశ్నించారు. ఆయన సోమవారం బాధితులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పామిడికి చెందిన మాల వెంకటచలపతికి వారసత్వంగా వచ్చిన మూడెకరాల 12సెంట్ల భూమిని తాజాగా కబ్జాచేశారన్నారు. నాయకులు రామకృష్ణ, గంగాధర్, కేపీ రాజు, సుగమంచి శ్రీనివాసులు, ప్రసాద్, ఓబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

అనంతపురం క్రైం,మే26(ఆంధ్రజ్యోతి) : పార్కు చేసిన ద్విచక్రవాహనాలే లక్ష్యంగా చేసుకుని వాటిని దొంగలిస్తున్న ముగ్గురు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు... నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన అశోక్(29 పాత దొంగతనాల కేసుల్లో నిందితుడు), నీరుగంటివీధికి చెందిన ముంతల సోమశేఖర్(ఏడు దొంగతనాల కేసులో నిందితుడు), అనంతపురం శివారులోని మరువకొమ్మ కొట్టాలకు చెందిన హుసేన్ వలిలు పార్క్ చేసిన బైక్‌లు తస్కరించేవారు. ప్రభుత్వాసుపత్రి, సాయినగర్ ప్రాంతాల్లో నకిలీ తాళాలతో చోరీలు చేశారు. వరుసగా బైక్ చోరీలు జరగడంతో సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం నిఘా ఉంచింది. సోమవారం ఆ ముగ్గురితో పాటు ఓ బాలుడిని అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో సీఐతో పాటు కృషి చేసిన హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్‌రావు, అమర్, బ్రహ్మయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, రామాంజినేయులు, విజయ్‌కుమార్, వన్నూరప్ప, నాగభూషణం, శేఖర్, రఘుకుమార్, నాగరాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.

మురళీనాయక్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, మే 26 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ అగ్నివీర్ మురళీనాయక్ జ్ఞాపకార్థం సోమవారం స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో అమిటీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు నివాళు లర్పించి, పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీల్లో మనోజ్ ఎలెవన్ జట్టుపై కిరణ్ ఎలెవన్ జట్టు, మావిరిక్స్ జట్టుపై క్రిక్ బాయ్స్ జట్లు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో అమిటి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆలమూరు వెంకటశివారెడ్డి, మారుతీ ప్రసాద్, ఉపాధ్యక్షులు ప్రతాప్, రాజశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి అగిలే జనార్దన్ రెడ్డి, రాము, మల్లికార్జున, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించండి


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

అనంతపురం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి) : రేషన్ సరకుల పంపిణీ బాధ్యతల నుంచి తమను తొలగించకుండా, తమకు ఉపాధి చూపాలంటూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఆందోళన చేపట్టారు. వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాలను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సోమవారం జిల్లా కేంద్రంలో ఎండీయూ ఆపరటర్లు నిరసనకు దిగారు. వందలాది వాహనాలతో తొలుత నగరంలో ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్ల సంఘం నాయకులు రామాంజినేయులు, బాబావలి, బాబ్‌జాన్, గంగాదర్, ఖాసీమ్, గణేష్, రమేష్‌తో పాటు పలువురు ఆపరేటర్లు పాల్గొన్నారు.

రాజకీయ స్వామ్యంతో వ్యవస్థకు తీవ్ర నష్టం

● ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం ప్రజలు యజమానులుగా పాలించవలసిన స్థానంలో రాజకీయ స్వామ్యం రాజ్యమేలుతోందని, తత్ఫలితంగా వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న ఎస్‌జే టవర్స్‌లో సోమవారం 'రాజ్యాంగం కనీస అవగాహన' అనే అంశంపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాక్షుడు రహీం, జిల్లా గౌరవాధ్యక్షుడు సయ్యద్ అమీర్, కోర్ కమిటీ కన్వీనర్ శంకర్‌గౌడ్ హాజరై మాట్లా డారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో చక్కటి రాజ్యాంగాన్ని రూపొందించుకొని ఒక పవిత్ర గ్రంథంగా అమలు చేసుకుంటున్నామన్నారు. ఇందులో శాసన, పరిపాలన, న్యాయనిబంధనలు ప్రధానమైనవన్నారు. రాజ్యాంగం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి ప్రశ్నించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం అమలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి సాంబశివ, కోశాధి కారి టివిరెడ్డి, ఈశ్వరయ్య, నాగభూషణం, ప్రసాద్, భీమ్సెన్‌రావు, చాంద్‌బాష, పరమేశ్వర రావు, బాలకృష్ణ, బసప్ప, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులుపాల్గొన్నారు.

భూసేకరణ వేగంగా చేపట్టాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పథకాల పనులకు సంబంధించిన భూ బదలాయింపు, భూసేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన ల్యాండ్ బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల కోసం స్పెషల్ డ్రైవ్‌లా బూసేకరణ,బదలాయింపు కొనసాగించాలని కలెక్టరు ఆదేశించారు. అలాగే కౌలురైతులకు అందించే సీసీఆర్సీ కార్డులు జిల్లాకు 8500వచ్చాయని వాటిని పంపిణీ చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీ, శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ల ఎన్నిక

● చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం ఏకగ్రీవం


నూతన వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న చైర్మన్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 26(ఆంధ్రజ్యోతి): ది అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్లుగా మాగిశెట్టి చంద్రశేఖర్, వడ్డే సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ అధ్యక్షతన సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు బ్యాంకు డైరెక్టర్లు మాగిశెట్టి చంద్రశేఖర్, వడ్డే సుబ్రహ్మణ్యాన్ని వైస్ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో వైస్ చైర్మన్లుగా పనిచేసిన వెంకటాద్రి, గోల్డ్ బాషా నుంచి రాజీనామాలను స్వీకరించి ఆమోదింపచేశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, డైరెక్టర్లు వెంకటాద్రి, కృష్ణకుమార్, రామాంజి నేయులు, చింతా భాస్కర్, గోల్డ్ బాష, రొళ్ల భాస్కర్, సుంకర రమేష్, రమణయ్య, బ్యాంకు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం : టీడీపీ

శింగనమల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగునున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలుగుయువత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూల్ చంద్రమోహన్ పిలుపుచ్చారు. జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లి మహానాడు కార్యక్రమాన్ని విజవంతం చేద్దామని ఆయన పిలపునిచ్చారు.

● చెన్నేకొత్తపల్లి : కడపలో మంగళవారం నుంచి మూడురోజులు పాటు నిర్వహించనున్న మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పిలుపునిచ్చారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు యజ్ఞేశంకర్, మాడెం సూర్యనారాయణరెడ్డి, రామాంజి, వడ్డే దుర్గ, హరినాథ్‌రెడ్డి, చెన్నకేశవులు గౌడ్, ఈడిగ బార్గవగౌడ్, చంద్రాయుడు, బండి ఆంజనేయులు, శ్రీధర్ పాల్గొన్నారు.

అధైర్య పడకండి... అండగా ఉంటాం

●మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గార్లదిన్నె, మే 26 (ఆంధ్రజ్యోతి): అధైర్య పడకండి... పార్టీ అండగా ఉంటుందని మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరు మాజీ సర్పంచు వడ్ల సుంకమ్మ చిన్న కుమారుడు వడ్ల శేఖర్ పామిడి వద్ద ఆదివారం రాత్రి ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి సోమవారం సాయంత్రం కల్లూరులోని మృతుడు శేఖర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ బలోపేతానికి శేఖర్ ఎంతో కృషి చేశాడన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అన్ని విధాలుగా అండ గా ఉంటామని ధైర్యం చెప్పారు. ముఖ్యంగా శేఖర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని సహయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్ల రాము, సుధాకర్ రెడ్డి, బొగ్గుల వెంకటేష్, బాబయ్య, మహబూబ్ పీరా, సామాల మధు, జగదీష్, అశోక్, సామాల రామాంజి, డాక్టర్ రామకృష్ణ, చింతావెంకట్రాముడు, గురుస్వామి, శ్రీనాథ్, డిష్ బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో సమస్యలు పరిష్కరించండి : సీపీఎం

అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం మండలంలోని రుద్రంపేట పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంచాయతీలో కొన్నేళ్లుగా పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని పరిష్కరించాలని, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి హిదయతుల్లాకు అందజేశారు. సీపీఎం నగరకమిటీ సభ్యులు ఇర్ఫాన్, లతీఫ్, షేక్ అజాంబాష, ఆదినారాయణ, కృష్ణవేణి, గఫూర్, పులి గమ్మ, ఆది, నల్లప్ప, అక్కులప్ప, నారాయణస్వామి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రోజూ చెత్త సేకరణ తప్పనిసరి : కమిషనర్

అనంతపురం క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు దుకాణదారుల నుంచి చెత్త సేకరణ చేప ట్టాలని నగర కమిషనర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్తను బయట వేసిన దుకాణదారులకు రూ.1,42,500 జరిమానా విధించారు. ఇప్పటిరకు నాలుగు రోజుల్లో రూ.3,27,050 జరిమానా విధించారు.

రూపురేఖలు మారిన విడపనకల్లు

- ప్రతి వీధిలోనూ సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- అభివృద్ధిలో పరుగులు పెడుతున్న గ్రామ పంచాయతీ
- మంత్రి పయ్యావుల చొరవతో రూ.కోట్ల నిధుల మంజూరు

విడపనకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రతివీధిలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే చాలావరకు పూర్తయ్యాయి. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ చూపి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడంతో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క సీసీ రోడ్డు వేసిన పాపాన పోలేదు. మురుగు కాల్వలు కూడా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతుండేది. దీంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. ఇక వర్షాలు పడితే చిత్తడే.. చిత్తడి. ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు వెళ్లే దారి,పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి మరింత అధ్వానంగా ఉండేవి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి కేశవ్ ప్రత్యేక చొరవ చూపడంతో విడపనకల్లు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. ప్రతి వీధిలోను సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. పలు కాలనీల్లో మంచినీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేయించారు. జిల్లాలో ఏ పంచాయతీలోను జరగని విధంగా విడపనకల్లులో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే కరకముక్కల గ్రామం నుంచి తాగు నీటికై మరో పైపులైన్‌ను కూడా ఎస్ఎస్ ట్యాంక్‌కు తీసుకొస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలుపుతున్నారు. ఈ పైపులైన్ పనులు పూర్తయితే ఎస్ఎస్‌ట్యాంక్‌లో తాగు నీరు పూర్తిగా అడుగంటిపోయినా.. ఈ కొత్త పైపులైన్ ద్వారా మరో 9గ్రామాలకు సైతం తాగు నీటిని అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ముందు జాగ్రత్తగా కరకముక్కల నుంచి విడపనకల్లుకు పైపులైన్ పనులు చేయించేందుకు మంత్రికి విన్నవించామని, దీనికి కూడా మంత్రి అనుమతులు ఇచ్చారని వారు పేర్కొంటున్నారు.

మంత్రి కేశవ్ సహకారంతోనే అభివృద్ధి చేశాం



మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక నిధులను కేటాయించడంతోనే విడపనకల్లులో తిష్ట వేసిన అనేక సమస్యలను త్వరగా పరిష్కరించగలిగాను. గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి రూపు రేఖలు మార్చేశాను. పలు కాలనీల్లో మంచి నీటి ట్యాంక్‌లు కూడా ఏర్పాటు చేయించాను. మరిన్ని కాలనీల్లోను ట్యాంక్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఇంకా కొన్ని కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు కూడా వేయించాల్సి ఉంది. వీటిని త్వరలోనే పూర్తి చేయిస్తాను.

-చంద్రశేఖర్, సర్పంచ్, విడపనకల్లు



సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణంతో రూపురేఖలు మారిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి



కురుబ కాలనీలో..



అద్దంలా ఉన్న కొత్తకోట రోడ్డు

నూతన స్తంభానికి విద్యుత్ తీగల ఏర్పాటు

కూడేరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభానికి విద్యుత్ తీగలను అమర్చారు. విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరడంపై ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో కూలిపోతే గానీ పట్టించుకోరా.. అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు శిథిలావస్థకు చేరుకున్న స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభానికి విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు.



నూతన స్తంభానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు

సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర

గుంతకల్లుటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24, 25 వార్డులలో సోమవారం సీపీఎం నాయకులు ప్రజాపోరు యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యవర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, రంగమ్మ, తిమ్మప్ప, ఓబులేసు ఈరన్న, సర్వసతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఉరవకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ.. పంచాయతీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఉరవకొండలో జరిగిన గవిమఠం రథోత్సవానికి సంబంధించి రూ.4లక్షలు ఖర్చు పెట్టినట్లు చెబుతున్నారని, దేనికి ఎంత ఖర్చు పెట్టారో వివరాలు వెల్లడించాలని వార్డు సభ్యుడు రవి ప్రశ్నించారు. గ్రామపంచాయతీ ఖర్చులకు సంబంధించిన బిల్లులను పారదర్శకంగా ప్రదర్శించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

ఘనంగా మన్రో జయంతి

గుత్తి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అప్పటి దత్తమండల కలెక్టర్ సర్‌థామస్ మన్రో 264వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తికోట పరిరక్షణ కమిటి, ప్రజా సైన్స్ వేదిక, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోటలో ఆంగ్లేయుల సమాధులలో ఉన్న మన్రో సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మన్రో ఆంగ్లేయుడి అయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటశివారెడ్డి, ఇస్మాయిల్, డాక్టర్ సురేష్‌బాబు, రామచంద్ర, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

గుమ్మఘట్ట, మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన హరిజన దుర్గన్న(41) గ్రామంలోనే స్వచ్ఛ సేవకుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వివిధ ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నొప్పి తీవ్రం కావడంతో భరించలేక గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు భార్య మారెక్క పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో మరొకరు..

డీ.హీరేహాళ్: మండలంలోని మడేనహళ్లి గ్రామంలో బొమ్మన్న(38) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన హనుమన్న కుమారుడు బొమ్మన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వ్యవసాయ పనుల కోసం ఇటీవల తన తండ్రికి చెందిన ఎద్దులను తోలుకెళ్లాడు. కాగా వాటిని తిరిగి తోలివ్వాలని గత ఆదివారం తండ్రి అడిగాడు. అయితే బొమ్మన్న అందుకు ఒప్పుకోలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇందుకు మనస్థాపం చెందిన బొమ్మన్న అలిగి ఎటో వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గ్రామ పరిసర ప్రాంతాలలో వెతికారు. సోమవారం ఉదయం తమ పొలానికి సమీపంలో ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకొని వేలాడుతుండడం గమనించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డికి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెల సంతానం.

సీఎస్ఐ టౌన్ చర్చి కార్యవర్గం ఏర్పాటు

గుత్తి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చికి సంబంధించి 2025-28వ త్రైవార్షిక నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. చర్చిలోనే సోమవారం నిర్వహించిన ఎన్నికకు రెవరెండ్ సాలోమెన్ ఎలక్షన్ అధికారిగా వ్యవహరించారు. సీబీజే రసెల్ కిరణ్, సురేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నూతన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా జేమ్స్ వర కుమార్, కిరణ్ సుశీల్‌కుమార్, దయానంద్, జే మనోరంజిత, టీఎస్ హర్షలత, మేరీ స్వర్ణలత, మార్షల్ రియాజ్, దేవసునీత్‌కుమార్, మోసెస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈద్గా మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపు

గుత్తి, మే 26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఈద్గా మైదానంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలను టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సోమవారం తొలగించారు. వచ్చేనెల బక్రీద్ ఉండడంతో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అక్కడ పెద్దఎత్తున ఉన్న పిచ్చి మొక్కలు, కంపచెట్లను మున్సిపల్ అధికారుల సహకారంతో తొలగించారు. నాయకులు రసూల్, అబ్రార్, సుధాకర్ పాల్గొన్నారు.

విలేకరి మృతికి పలువురి సంతాపం

ఉరవకొండ, మే26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవికి చెందిన ఓ న్యూస్ చానల్ విలేకరి నాగరాజు ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి సోమవారం పలువురు సంతాపం తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు వై మధుసూదన్‌రెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు బూదగవికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక మంత్రి కేశవ్ రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు.

చెట్టు కొమ్మల నరికివేత

కణేకల్లు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెంపల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను సోమవారం కొందరు వ్యక్తులు నరికివేశారు. 2019కి ముందు టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు ప్రత్యేక శ్రద్ధతో పలు గ్రామాల రోడ్లకు ఇరువైపులా ఉపాధిహామీ పథకం కింద మొక్కలు నాటించారు. ఈ క్రమంలో మారెంపల్లి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. అవి ప్రస్తుతం పెరిగి పెద్దవై వాహనదారులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. సోమవారం వీటి కొమ్మలను కొంతమంది వ్యక్తులు నరికి వేయడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.



చెట్టు కొమ్మలను నరికేసిన దృశ్యం

యోగాంధ్రలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి : కలెక్టర్

తాడిపత్రి, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో అనంతపురం జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని, జిల్లా ప్రజలంతా యోగాను నిత్యం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందులో భాగంగా తాడిపత్రిలోని పురాతనమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మంచి ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయన్నారు. ప్రజలు యోగాను నిత్యం చేసేలా అలవాటు చేసుకోవాలని అన్నారు. అనంతరం బుగ్గరామలింగేశ్వరస్వామిని, పార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నేడు యోగాంధ్ర వేడుకలు

పుట్లూరు/ రాయదుర్గం రూరల్: పుట్లూరు, రాయదుర్గం ఎంపీడీఓ కార్యాలయాల్లో మంగళవారం యోగాంధ్ర వేడుకలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు అలివేలమ్మ, కొండన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, సచివాలయ సిబ్బంది హాజరవ్వాలని కోరారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

బొమ్మనహాళ్/బెళుగుప్ప, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే టీడీపీ మహానాడుకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్దఎత్తున బలుదేరి వెళ్లారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారంతా వివిధ వాహనాలను సమకూర్చుకుని తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, స్టోర్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, నాయకులు నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు, కృష్ణాపురం శీన, గాలి బసప్ప, సంగప్ప తదితరులు ఉన్నారు. అలాగే బెళుగుప్ప మండలం అంకంపల్లి గ్రామం నుంచి నాయకులు మాదినేని నరేంద్ర, పురుషోత్తమ్, శ్రీనివాసులు, ఈశ్వర్, కిష్టప్ప , మహిళలు మహానాడుకు తరలివెళ్లారు.



బెళుగుప్ప మండల అంకంపల్లి నుంచి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

కుందుర్పి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు చాలామంది అధికారు డుమ్మా కొట్టారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ బాలాజీ, ఏపీఎం సర్దానప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మినహా అధికారులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో సమస్యలు విన్నవించడానికి వచ్చిన ప్రజలు అక్కడ అధికారులు లేనిది చూసి నిరాశగా వెనుదిరిగారు. అధికారులు ఇలా ఉంటే ఇక ప్రజాసమస్యలు ఎలా పరిష్కారమవుతాయంటూ పలువురు నిట్టూర్చారు. కొన్ని వారాలుగా ఇలానే జరుగుతోందని అసహనం వ్యక్తం చేశారు.



అరకొరగా హాజరైన అధికారులు

బీసీ కాలనీలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

గుత్తి, మే 26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని బీసీ కాలనీలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా సోమవారం సిబ్బందితో కలిసి పర్యటించారు. అక్కడ ఓ ప్రైవేట్ స్థలంలో భారీగా కంపచెట్లు పెరిగిపోయాయని, దీంతో కాలనీలోకి పాములు వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆ స్థలాన్ని పరిశీలించారు. తక్షణమే కంపచెట్లు తొలగించాలని స్థల యజమానికి సూచించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబుబ్ బాషా, హెల్త్‌కార్యదర్శి వనజాక్షి పాల్గొన్నారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే

తాడిపత్రి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాబ్ అచీవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ హరిబాబు మాట్లాడుతూ కళాశాల నుంచి 69మంది విద్యార్థులు కల్పతరువు ప్రాజెక్ట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆకృతి కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. టెన్త్ పాసై పాలిటెక్నిక్ విద్య ద్వారా చిన్న వయసులోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చునని చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో పాత పద్మాలయ టాకీస్ ఆవరణలో గల పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. అక్కడ ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5910 నగదును స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎడతెరిపి లేని వర్షం

యాడికి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు జోరు వర్షం కురిసింది. ఖరీఫ్ సేద్యాలకు ఈ ఏడాది ముందస్తు వర్షాలు బాగా కురుస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ల్యాండ్ దర్బార్

పెద్దపప్పూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ఆర్డీఓ కేశవనాయుడు ఆధ్వర్యంలో ల్యాండ్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై చర్చ

గుంతకల్లుటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన జరిగింది. సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. టీడీపీ కౌన్సిలర్ ఆర్. పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, చిన్నపాటి వర్షాలకే డ్రైనేజీల్లో మురుగు నీరు రోడ్లపై పారుతోందని వాపోయారు తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని, కాలువల్లో పూడిక తీయించాలని కోరారు. కరోనా మళ్లీ వ్యాపిస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే తమ వార్డుల్లోని వివిధ సమస్యలను పలువురు కౌన్సిలర్లు సభలో వెల్లడించారు. అన్నింటినీ పరిష్కరిస్తామని కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదించారు. మున్సిపల్ మేనేజర్ రాధ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాలివీస్తే చాలు.. కరెంట్ బంద్

- మూడు రోజుల నుంచి ఎడాపెడా విద్యుత్ కోతలు

కళ్యాణదుర్గం, మే 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి గాలివీస్తే చాలు... కరెంట్ సరఫరాను ఉన్నఫలంగా ఆపేస్తున్నారు. కరెంట్ బంద్ కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య గత మూడు రోజుల నుంచి వేధిస్తోంది. నియోజకవర్గంలో కళ్యాణదుర్గం పట్టణం, కంబదూరు మండలంతో పాటు మరికొన్ని మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. సోమవారం ప్రతి ఐదు నిమిషాలకు ఒక్కసారి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కరెంట్ వస్తూ పోతుండడంతో పలు ఎలక్ట్రిక్ పరికరాలు దెబ్బతిన్నాయని పట్టణ వాసులు వాపోయారు. విద్యుత్ తీగల మీద భారీ చెట్లు పడడంతోనే ఈ సమస్య నెలకొందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు, కొమ్మలను కట్ చేస్తూ ట్రాన్స్‌కో అధికారులు పనులు చేస్తున్నా, ఎక్కడో ఒక చోట సమస్య ఉత్పన్నం అవుతోంది. దీంతో గత మూడు రోజుల నుంచి ఇదే పనుల్లో ట్రాన్స్‌కో అధికారులు సైతం నిమగ్నమయ్యారు. చిన్నపాటి గాలికే విద్యుత్ సర్వీసులన్నీ దెబ్బతింటున్నాయంటే, పెదఎత్తున గాలి, వర్షం, పిడుగులు వస్తే పరిస్థితి ఏమిటోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యపు ధోరణి అవలంబిస్తున్నారని వారు వాపోతున్నారు.

కుటుంబమిత్ర కార్యకర్తల నియామకం

రాయదుర్గంరూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుటుంబ మిత్ర కార్యకర్తల నియామకం జరిగినట్లు విభాగ్ కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ చింత మునుస్వామి సోమవారం తెలిపారు. స్థానికంగా సమావేశం నిర్వహించి ఐదు బస్తీలకు కుటుంబ మిత్రలను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ కారుమంచి, రాయదుర్గం ఖండ ప్రముఖ్ సోమ రవికుమార్, సహ ప్రముఖ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

గుత్తి, మే 26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలును లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి సాధుబాబు సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి వంట గది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, బ్యారెక్‌లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సబ్ జైలు ఆవరణలో కంపోస్ట్ యార్డు ఏర్పాటు చేయాలని జైలర్ మహేశ్వరుడుకు సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు సిబ్బంది సాధిక్ వలి పాల్గొన్నారు.



బ్యారెక్‌ను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి

ప్రోత్సాహక బహుమతుల అందజేత

పామిడి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనపరచిన చిన్నారులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇందులో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. చిన్నప్పటి నుంచి భగవద్గీతను చదవడం కంఠస్థం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. జీవన విధానంపై అవగాహన కల్గుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, రాజ్‌కుమార్ శర్మ, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బొమ్మనహాళ్, మే, 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బీనగర్ గ్రామంలో బళ్లారి- కళ్యాణదుర్గం రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్బీనగర్ గ్రామానికి చెందిన వై. శ్రీనివాసులు మధ్యాహ్నం సమయంలో గ్రామ సమీపంలోని తన తోటలోంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అయితే రహదారిపైకి రాగానే బళ్లారి వైపు నుంచి వస్తున్న లగేజీ బొలేరో వాహనం ఢీ కొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలవగా.. స్థానికులు వెంటనే ప్రైవేట్ వాహనంలో బళ్లారి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

టిప్పర్ ఢీకొని ఆటోడ్రైవర్‌కు..

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రావులుడికి గ్రామానికి చెందిన మల్లికార్జున ఆటోలో రాయలచెరువుకు కూరగాయలు తరలిస్తుండగా కిష్టిపాడు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

నేషనల్ క్యాంప్‌లో సత్తా

గుంతకల్లుటౌన్,మే 26(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్లు వీ.భవాని, డీ.శివకృష్ణ నేషనల్ క్యాంప్‌లో సత్తాచాటారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య సోమవారం తెలిపారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో 9వ తెలంగాణ బెటాలియన్ అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంప్-11ను ఈనెల 14నుంచి 25వ తేదీ వరకు నిర్వహించారన్నారు. ఇందులో ఐదు రాష్ట్రాల ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారన్నారు. వారికి వివిధ రకాల పోటీలను నిర్వహించగా.. భవాని, శివకృష్ణ ప్రతిభ చాటరన్నారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

న్యాయం జరగలేదని ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గంరూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): తనకు పోలీస్‌స్టేషన్లో న్యాయం జరగలేదని పట్టణానికి చెందిన వలీ అనే వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన పెట్రోల్‌ను బాటిల్లో తెచ్చుకుని ఒంటిపై పోసుకుంటుండగా ఓ కానిస్టేబుల్ వెళ్లి అడ్డుకున్నారు. అనంతరం వలీ మాట్లాడుతూ తన కుమార్తె నెలరోజులుగా కనిపించలేదని, పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేశారని, అయితే ఇంత వరకు న్యాయం చేయలేదని వాపోయారు. ఆ కేసును నీరుగార్చారని ఆరోపించారు. న్యాయం కోసం వస్తే సీఐ దుర్భాషలాడాడని కన్నీటి పర్యంతమయ్యారు. న్యాయం జరిగేంత వరకు ఇక్కడినుంచి వెళ్లేదే లేదని స్టేషన్ ఎదుట బైఠాయించాడు. దీనిపై సీఐ యువరాజును వివరణ కోరగా అతడి కుమార్తె మేజర్ కావడంతో ఆమె కోరిక మేరకు వాళ్ల అమ్మమ్మ దగ్గర పట్టణంలోనే ఉంటోందన్నారు. అలాంటప్పుడు మిస్సింగ్ కేసు ఎలా అవుతుందన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ అతను నానా హంగామా సృష్టించాడన్నారు.

చెరువులకు నీరివ్వాలని వినతి

గుంతకల్లుటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): రాగులపాడు నుంచి వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని చెరువులకు హంద్రీనీవా నీరు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ .జగదీష్, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చాయాపురం పర్యటనకు వచ్చినప్పుడు రాగులపాడు కాలువ నుంచి గుంతకల్లు మండలంలోని చెరువుల నీరు ఇస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి

శెట్టూరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలంటూ మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులు, ఎస్సీ కాలనీ ప్రజలు, యువకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో పేద ప్రజల సంక్షేమానికి ఎంతో పాటు పడుతున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను నిలిపివేయడం దారుణమన్నారు. కేంద్రం ఇప్పటికైనా స్పందించి పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా పాల్గొన్నారు.

కరువు భత్యం చెల్లించాలని వినతి

కళ్యాణదుర్గం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే కరువు భత్యాన్ని చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల దినోత్సవంలో ఆర్డీవో వసంతబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

స్టాఫ్‌నర్సుపై చర్యలు తీసుకోండి: సీపీఎం

పెద్దవడుగూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ.. రోగులను దుర్భాషలాడుతున్న స్టాఫ్ నర్సు ఖైరున్నీసాపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీటీ వెంకటేశ్వరమ్మకు ఫిర్యాదు చేశారు. మండల కార్యదర్శి దస్తగిరి , పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముచ్చుకోట హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యానికి డీఈఓ ప్రసాద్‌బాబు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల దరకాస్తులను స్క్రూటినీ చేయాల్సిన కీలక సమయంలో హెచ్ఎం సుబ్రమణ్యం అందుబాటులో లేరు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం హెచ్ఎం సుబ్రమణ్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.